ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కరువు

- లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపని వైనం
- దరఖాస్తుల కోసం ప్రణాళిక విభాగం అధికారుల అవస్థలు



ఎల్‌ఆర్‌ఎస్‌పై మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ఫ్లెక్సీ , ఆటోలో ప్రచారం

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)కు స్పందన కొరవడింది. అక్రమ లేఅవుట్లు, అందులోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించేందుకు ఆటోల్లో ప్రచారం, కరపత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

భూమి ధరలు పడిపోవడమే కారణమా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైనట్లు చర్చ సాగుతోంది. స్థలాల ధరలు కూడా భారీగా పడిపోయాయని 'రియల్' వ్యాపారులు చెప్తున్నారు. రియల్ భూం బాగా సాగిన సమయంలో వేసిన అక్రమ లేఅవుట్లలో విచ్చలవిడిగా ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే వ్యాపారులు అక్రమమార్గంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే లేఅవుట్లను రూపొందించి, అన్ని అనుమతులు ఉన్నాయన్న భ్రమ కల్పించి ప్లాట్లను వినియోగదారులకు విక్రయించారు. ప్రస్తుతం ధరలు పడిపోవడంతో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఉందనే చర్చ జరుగుతోంది. కాగా గతంలో ఎటువంటి అనుమతి లేకుండా రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో దాదాపు 28 అనధికారిక లేఅవుట్లను వేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

క్షేత్రస్థాయిలో స్పందన కరువు:

క్రమబద్ధీకరణ ఫీజు, ఓపెన్ స్పేస్ చార్జీల్లోనూ రాయితీలు ప్రకటించినా ఆసక్తి చూపడం లేదు. అనుమతులు తీసుకోని లేఅవుట్లలో 2025 జూన్ 30 లోపు ప్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారంతా ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హులుగా ప్రభుత్వం పేర్కొంటూ అక్టోబర్ 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కానీ రాయదుర్గం పురపాలక సంఘంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు క్షేత్రస్థాయిలో స్పందన లభించడం లేదు. సాధారణంగా ఏదైనా లేఅవుట్‌లో, వెంచర్లు రూపొందించినప్పుడు విధిగా వ్యవసాయ భూమి నుంచి కమర్షియల్‌గా మార్చేందుకు ల్యాండ్ కన్వర్షన్ (భూమి మార్పిడి) చేయాల్సి ఉంటుంది. అనంతరం అన్ని రకాల అనుమతులతో లేఅవుట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఎల్‌ఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకోండి



అనధికారిక ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రభుత్వం కల్పించిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ను యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. చట్టబద్ధమైన క్రమబద్ధీకరణ లేఅవుట్లతోపాటు వాటిలోని ప్లాట్ల యజమానులకు అనేక ఉపయోగాలు ఉంటాయి. భవన నిర్మాణ అనుమతులు, విద్యుత్, నీటి సౌకర్యం, డ్రైనేజీ వంటి సౌకర్యాలు అందుతాయి. ఈ పథకంలో విస్తృత అవగాహన పొంది అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణతోపాటు ప్లాట్లను కూడా క్రమబద్ధీకరించుకోవాలి. మరింత సమాచారం కోసం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతోపాటు మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో విచారించాలి.

– మురళీమోహన్,
టీపీఎస్, రాయదుర్గం మున్సిపాలిటీ

క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గత నెల 23న నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం చేవారు. స్థానిక జామాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో జామియా తాసీరియా ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తకీబాబా, సయ్యద్ తాసీర్ బాబాల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గుంతకల్లుకు చెందిన మహ్మద్ ఖలీద్ ఫజల్‌కు మొదటి బహుమతిగా బంగారు పతకం, రెండో స్థానంలో నిలిచిన ఉరవకొండకు చెందిన నబీహ పర్వీన్‌కు వెండి పతకం, మూడో స్థానంలో నిలిచిన అనంతపురానికి చెందిన సయ్యద్ షాహిద్‌కు రూ.3వేల నగదు అందించారు. అనంతరం మెహ్ఫిలే మిలాద్ ఉన్ నబీ సమావేశాన్ని నిర్వహించారు. భారత దేశపు ప్రసిద్ధి చెందిన నాత్ ఖ్వాన్ మహ్మద్ నాహిద్ నూరి సాహెబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మాణం



ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

కుందుర్పి: మండలంలోని నాగేపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలంలో వడికేరమ్మ అనే మహిళ ఇంటి నిర్మాణం చేపట్టింది. దీంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తులు, వడికేరమ్మ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు నిర్మించండి



ఎన్‌ఎన్‌పీతండాలోని సిద్ధలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి

వజ్రకరూరు: మండలంలోని ఎన్‌ఎన్‌పీతండా సమీపంలో సిద్ధ లింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఆలయానికి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినాల్లో ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి నూతన సీసీ రోడ్డు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

నిరుపయోగంగా కెనరా బ్యాంకు ఏటీఎం



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కెనరా బ్యాంక్ (సిండికేట్) ఏటీఎం మూతపడింది. మూడు నెలల నుంచి ఏటీఎం కేంద్రం పనిచేయడంలేదు. ఆగస్టు 1న ఏటీఎం సెంటర్‌లోని మిషన్‌ను కూడా ఇక్కడి నుంచి ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఏటీఎం కేంద్రం పనిచేస్తోందని ఖాతాదారులు సెంటర్ వద్దకు వచ్చి వెనుదిరుగుతున్నారు.

త్వరలో అందుబాటులోకి...

ఈ విషయమై కెనరా బ్యాంకు మేనేజర్ గురుప్రసాద్‌ను అడగ్గా, పాత మిషన్ కావడంతో పని చేయడం లేదన్నారు. దీంతో ప్రధాన కార్యాలయానికి మిషన్ పంపామని, త్వరలో కొత్త ఏటీఎం వస్తే సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.

అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు

బొమ్మనహాళ్: మండలంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. గ్రీవెన్స్ విభాగం మండల అధ్యక్షుడిగా వై.బి. పురుషోత్తంరాజు, ఉపాధ్యక్షుడిగా అనంతరెడ్డి, వంశీ, జనరల్ సెక్రటరీలుగా సుదర్శనరెడ్డి, నరసింహప్ప, వేణు, సెక్రటరీలుగా సి.గోవిందరెడ్డి, దేవేంద్రనాయక్, హెచ్.శ్రీరాములు, జి.ఎర్రిస్వామి, బీసీ తిమ్మప్ప, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షణ్ముఖ, గోపాల్‌యాదవ్, బి.రాము, సన్నప్ప, గోవిందు, చంద్రానాయక్‌ను ఎంపిక చేశారు.

ఐటీ విభాగం ఎంపిక: మండల అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్ , ఉపాధ్యక్షుడిగా కె.రాజేష్‌రెడ్డి, పఠాన్ ఇదాయత్ అలీ, జనరల్ సెక్రటరీలుగా సురేష్, పృథ్వీరెడ్డి, సోము, సెక్రటరీలుగా చంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శనరెడ్డి, సురేష్, సంజీవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా యుగంధర్‌రెడ్డి, కేశవరెడ్డి, మధు, శివారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నవీన్, అన్వర్‌ను ఎంపిక చేశారు.

జగదీశ్వరీ ఆలయంలో హోమాలు



జగదీశ్వరీ ఆలయంలో లోక కళ్యాణం కోసం హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులో వెలసిన జగదీశ్వరీ అమ్మవారి ఆలయంలో పూర్ణమి సందర్భంగా ఆదివారం హోమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, మంగళహారతి, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో రుద్ర హోమం, లలిత త్రిపుర సుందరీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శశి మాకులమ్మ ఆలయంలో చోరీ

కుందుర్పి: మండల పరిధిలోని కరిగానిపల్లి శివారులో ఉన్న శశి మాకులమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోకి ప్రవేశించి, 20 తులాల వెండి ఆభరణాలు, ఒకటిన్నర తులం బంగారు తాళి బొట్టు, రూ.6వేల నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీటీపీకి కృష్ణా జలాలు తీసుకొస్తాం



బీటీపీ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: కూటమి ప్రభుత్వ హయాంలో బీటీపీకి కృష్ణా జలాలను తీసుకొచ్చి తీరుతామని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని బీటీపీ డ్యాంను మాజీ మంత్రి దేవినేని ఉమాతో కలసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బీటీపీకి ఎన్ని అవరోధాలు ఎదురైనా రూ.968 కోట్లతో కృష్ణాజలాలను తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈఈ గీతాలక్ష్మి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేద్దాం



కళ్యాణదుర్గంలో అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు



పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరును విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో రైతుల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. రైతులకు యూరియాతో పాటు ఎరువులు సరఫరా చేయకుండా వేధిస్తున్నారన్నారు. ఈనెల 9న కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్లు సుధీర్, గోళ్ల సూరి, హనుమంతురాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, గొల్ల హనుమంతురాయుడు, మాజీ మండల కన్వీనర్, సీనియర్ నేత తిరుమల వెంకటేశులు, నాయకులు పాతలింగ, తిప్పేస్వామి, లాయర్ రామాంజనేయులు, అతావుల్లా, షేక్షావలి, బిక్కిహరి, బోరంపల్లి రామిరెడ్డి, పండు, మల్లి, వన్నూరస్వామి, జానీ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

ఉరవకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న అన్నదాతకు అండగా నిర్వహించనున్న అన్నదాత పోరు పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. పార్టీ కార్యాలయంలో ఉరవకొండ, పట్టణ వైఎస్సార్‌సీపీ, రైతు కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్ మాట్లాడారు. అన్నదాతల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే దిశగా ఈ పోరు ఉంటుందన్నారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించలేని ఒక అసమర్థ పాలనను చూస్తున్నామని మండిపడ్డారు. కృత్రిమ కొరత సృష్టించి యూరియా బ్లాక్ మార్కెట్ దందాతో కూటమి నేతలు కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకూ వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాతల పోరులో వేలాదిగా తరలివచ్చి, గుంతకల్లు ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరన్న, ఎంపీపీ నరసింహులు, మోపిడి సర్పంచ్ సిద్దార్థ, విడపనకల్లు ఎంపీపీ పుష్పావతి, రాకెట్ల అశోక్, ఏసీ ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, ములగిరిపల్లి ఓబన్న, బసవరాజ్, వెలిగొండ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు బాసటగా నిలుద్దాం



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: అన్నదాతకు బాసటగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 9న కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆదివారం తన నివాసం వద్ద పట్టణ, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి హీరేహాళ్ మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రామాంజనేయులు, గౌని లక్ష్మీ కాంతారెడ్డి, బ్రహ్మానందారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివా, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, జిల్లా ఉపాధ్యక్షులు మారన్న, ఐదు మండలాల నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాటి నుంచి అన్నదాతలను అడుగడుగునా దగా చేస్తోందన్నారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించలేని అసమర్థ పాలన సాగిస్తోందన్నారు. కృత్రిమ కొరత సృష్టించి, యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు చెప్పిన వారికే యూరియా పంపిణీ చేయడం సరికాదన్నారు. ఇటీవల కణేకల్లు మండలంలో వెలుగుచూసిన కొన్ని ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మార్పీకే యూరియా పంపిణీ చేయడంతో పాటు టమాట, ఉల్లి, చీనీ, బొప్పాయి, కాటన్, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగనన్న పాలనలోలాగా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి మార్కెట్లో పోటీ పెరిగేలా చూడాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులను రాజుగా చూశారన్నారు. విత్తు నుండి విపత్తుదాక వెన్నంటి నిలిచి ఆదుకున్నారని గుర్తు చేశారు.

పరిహారం ఇచ్చేదాకా వదిలేదేలేదు..

గత రబీ సీజన్‌లో ప్రకృతి విపత్తుకు దారుణంగా నష్టపోయిన వరి, పత్తి, మొక్కజొన్న రైతులకు పరిహారం ఇచ్చేదాకా కూటమి సర్కారును వదిలేదేలేదని మెట్టు గోవిందరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఎందుకు పట్టించుకోలేదన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు దిలవర్ బాషా, కడ్డిపుడి నజీర్, సర్పంచ్ సుదర్శన రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వరకూటి హంపారెడ్డి, ఆలూరు చిక్కన్న, ఎంద్రకాయల వన్నూరప్ప, కాదలూరు హనుమతరెడ్డి, నాగలాపురం అంజిరెడ్డి, యూత్‌నాయకుడు అరవింద్‌బాబు, కల్యం చిత్రయ్య, కొలిమి ఆనంద్, గంగాదర, బండి రామకృష్ణారెడ్డి, కణేకల్లు కెంగోటి రామిరెడ్డి, హళ్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు' కార్యక్రమానికి తరలిరండి

కణేకల్లు: ఈనెల 9న కళ్యాణదుర్గంలో నిర్వహించ తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఎప్పుడూ యూరియా కొరత లేదన్నారు. రాష్ట్రం, జిల్లాలో యూరియా కొరత లేదంటూ కేబినెట్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు చేస్తున్న ప్రకటనలకు రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న కష్టాలు చూస్తుంటే పూర్తి భిన్నంగా ఉన్నాయన్నారు. లోడ్లకు లోడ్లు యూరియా వస్తుంటే అవి ఎక్కడికెళుతున్నాయో కూటమి సర్కారే సమాధానం చెప్పాలన్నారు. కూటమి సర్కారు వైఫల్యాన్ని ఎండగడుతూ అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

పెరిగిన కంది సాగు విస్తీర్ణం



వజ్రకరూరు సమీపంలో సాగు చేసిన కంది పంట

వజ్రకరూరు: మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు కంది సాగుపై మొగ్గు చూపారు. మండలంలో వేరుశనగతోపాటు కంది,ఆముదం, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేశారు. అధిక మొత్తంలో కంది పంట సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. మండల వ్యాప్తంగా 39,606 ఎక రాల్లో రైతులు కంది పంట సాగు చేసినట్లు ఏఓ మధుకర్ తెలిపారు. 4233.9 ఎకరాల్లో వేరుశనగ, 365 ఎకరాల్లో ఆముదం, 16 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో పత్తి, 56 ఎకరాల్లో సజ్జ తదితర పంటలను సాగు చేసినట్లు ఏఓ తెలిపారు. మొత్తం అన్ని పంటలు కలిపి 44,316.9 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. పంటల సాగులో రైతులు సలహాలు,సూచనలతోపాటు మెలకువలు పాటించి మంచి దిగుబడి సాధించాలని ఏఓ తెలిపారు.

మూతపడిన ప్రముఖ ఆలయాలు



నేమకల్లు ఆలయాన్ని మూసివేసిన దృశ్యం



ఆలయ ద్వారాలు మూసిన సిబ్బంది

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు తెలిపారు. ఆదివారం సంపూర్ణ చంద్రగహణం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి మహామంగహారతి చేసి ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయాన్ని తెరచి, శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలతో పాటు అన్ని ఆలయాల తలుపులు ఆదివారం మూతపడ్డాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు సోమవారం తెల్లవారు జాము వరకు మూసివేశారు. అనంతరం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాల అనంతరం తలుపులు తెరిచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం, జంబుకేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం మూసివేశారు.

వజ్రకరూరు: మండలంలోని జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయం, షిర్డీసాయి ఆలయం, నగరేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి మూసివేశారు. తట్రకల్లులో ప్రసిద్ధ ఆలయం వీరభద్రస్వామి ఆలయం, జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేశారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రధాన ఆలయాలను ఆదివారం చంద్రగ్రణం సందర్భంగా మూసివేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, ఆంజనేయస్వామి, శివాలయాలతో పాటు ప్రధాన ఆలయాలు మూసి వేశారు. సోమవారం ఉదయం ఆలయ తలుపులు తెరిచి ఆలయ సంప్రోక్షణ, శుద్ధి అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

ఉరవకొండ రూరల్: మండలంలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. గ్రహణానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సోమవారం వేకువ జామున 5 గంటలకు ఆలయాన్ని తెరిచి శుద్ధి చేశాక 6 గంటలకు సుప్రభాత సేవతో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

'ఉపాధి' బిల్లుల మంజూరులో జాప్యం



చోళసముద్రంలో ఫారంపాండ్ పనులు చేస్తున్న కూలీలు

కూడేరు: ఉపాధిహామీ బిల్లులు మంజూరు కాకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి 8,553 మంది కూలీలకు రూ.1,01,15,708 బిల్లులు పెండింగ్‌లో ఉంది. దీంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలో బిల్లులు విడుదల

ఉపాధిహామీ కూలీల బిల్లులు విడుదల కావాల్సి ఉంది. పనులు చేసిన వెంటనే కొలతలు తీసి బిల్లులు పెట్టాం. ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లులు విడుదల కావాల్సి ఉంది. త్వరలోనే వచ్చే అవకాశాలున్నాయి. వచ్చిన వెంటనే కూలీలకు మంజూరు చేస్తాం.

– పోలేరయ్య, ఉపాధి ఏపీఓ

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

కణేకల్లు: మండలంలోని ఆదిగానిపల్లి, రచ్చుమర్రి, గంగలాపురం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆదిగానిపల్లి గ్రామంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

ఉరవకొండ రూరల్: మండలంలోని రేణుమాకులపల్లి గ్రామ శివారులోని చింతతోపులో ఆదివారం పేకాట స్థావరంపై ఉరవకొండ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడగా, నలుగురు పరారీ అయినట్లు ఎస్ఐ జనార్దన్ నాయుడు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,390 నగదు, 6 మొబైళ్లు, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎంఈఓ పోస్టు భర్తీ ఎప్పుడో?



మూతబడిన ఎంఈఓ చాంబర్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మండలానికి ఎంఈఓ లేకపోవడంతో పరిపాలన విభాగంపై తీవ్ర చూపనుంది. ఎంఈఓ ఎంఈఓ–1 ఎస్.నాగమణి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. నేటికీ రెగ్యులర్ ఎంఈఓ పోస్టు భర్తీ చేయకపోగా, కనీసం ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించలేదు. ఎంఈఓ–1 స్థానంలో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేలా ఎంఈఓ–2 గా పని చేస్తున్న వారికి నిబంధనల మేరకు అధికారాలు లేవు. జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టలేదు. ఎంఈఓ లేని ప్రభావం కార్యాలయంతోపాటు పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల జీతాలు, ఉపాధ్యాయుల సెలవుల మంజూరు, అత్యవసర మెడికల్ లీవ్‌లు, ఎస్ఆర్ అప్‌డేట్, పర్యవేక్షణపై ప్రభావం చూపనుంది.

అధికారుల హోదా తికమక



తహసీల్దార్ కార్యాలయంలో స.హ చట్టం బోర్డులో మారని అధికారి పేరు

కూడేరు: డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాపా? లేక ఉదయ్ భాస్కరా? అని మండల ప్రజలు తికమకపడుతున్నారు. కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో పౌర సమాచార అధికారి హోదాలో డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్ అని రాశారు. ఆయన జూన్ నెలలో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉదయ్ భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. కానీ స.హ. చట్టం బోర్డులో మాత్రం నూతనంగా వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ అధికారి పేరు, ఫోన్ నంబర్ చూపించలేదు. ప్రజలు కార్యాలయంలోకి ప్రవేశించగానే ముందుగా సమాచార హక్కు చట్టం బోర్డు కనిపిస్తుంది. పాత అధికారి పేరు ఉండడంతో ప్రజలు తికమక పడుతున్నారు.